# అదే తల్లీ! ఆ రవికే!!

శ్రీ బాలకవి కవితావినోద పప్పుచిట్టి వేంకటసుబ్బారావుగారు

తలారముట్టా నెరిసిపోయింది. దృష్టి మందగించి పోయింది గాబోలు పాపం తనువును దేవులాడుతున్నాడు. నెరిసిపోయింది గడ్డంకూడా, అచ్చబంగారు తివ్వెలులాగుండి ముడతల మొఖానికి అదో సౌందర్యం చేకూరుస్తున్నాది. మరి వార్ధక్యాన్ని మోయలేనని వాలిపోయింది నడుము. కర్రూతచేసుకు యేదో కాస్త నడవగలుగుతాడు. మాట అంత స్పష్టంగా లేక గొణుక్కుపోతోంది—పాపం! అన్నీ ఉడిగినా అవస్థ ఉడుగవుకదా!......అంత దీనావస్థలో దీనాతిదీనమగు దారిద్ర్యబాధకూడా అనుభవిస్తున్నాడు. ఎందుకని యింకా బ్రతుకాసిస్తాడో హాయిగా యెందులోనో దిగబారక—సుఖిస్తున్నాడేమో అంటే కళ్లంటనీళ్లు కారుతూ నేవుంటా యెప్పుడూను. అడుగుతే తప్పెట్టుకుంటాడేమో? అత డేదో కేక వేస్తున్నాడు. అబ్బ! ఎంత క్షీణంగావుంది—గృహాంతరాళంనుండి వెలువడిన యెలుంగు లాగుంది......అదిగో! ఏదో ప్రత్యుత్తరంలా వినబడుతోంది. తియ్యగా హాయిగా, కోకిలస్వనం లాగుంది......అదే కావాలి......కాకపోతే, అరణ్యరోదన, ఆర్తికేక నాలకించేదెవరు? మారుపలికే పాటియాప్తు లెవరుంటారు? వట్టి దిక్కుమాలిన పక్షి లాగున్నాడు కదా. పాపం యెంత కనికారం చేసిందో...? మనుష్యులకంటే పక్షులే నయం—అందులో కోకిల. కాదూ మరి లేమావిచిగుళ్లు తినే లేతహృదయం. ముసలాడి కేకకి "ఓయ్" అన్నట్లు "కో" అని కూసింది ముద్దుగా. అచ్చే యెంత పొరపడ్డాను...కన్య!—ఆమె పలికింది—ఎంత ప్రేమ!—ఏమి సృష్టి? గాఢాంధకారంలో కడు కాంతి మెఱపు; కష్టవారాసిలో నానందనావ; అంత వృద్ధాప్యంలో నంత దారిద్ర్యదశలో నాశాలత నల్లుకు మెల్లన కాల మెల్లపుచ్చేదా పిల్లను చూచుకొనే కాబోలు. ఎంతమాట! కాకిపిల్ల కాకికిముద్దు కాదూ...... తాతకా పిల్లేమాతుందో. ఎంత వాత్సల్యంగా మాట్లాడుకుంటున్నారు. వళ్లోవాలింది విగిలిపిట్టలా. వృద్ధదేహా న్నదుముకున్నాడు. ఎనబది వత్సరాల చేతులు నిమురుతున్నాయా పిల్ల లేతదేహాన్ని. బొక్కినోరు సవరించుకుంటున్నాడు. బాలిక తన లేత చేతితో దాన్ని తాత మెడకి చుట్టేసింది. రెండూ దానితో పండుగడ్డం దువ్వుచూ కిలకిలా నవ్వుతూ......

"తాతా! ఎందుకూ పిలిచేవూ!"

"మాల్యం! పిలిచానమ్మా. ఏంచేస్తున్నావో కనుక్కుందామని—ఏంచేస్తున్నావురా—చిట్టితల్లి!" అప్రయత్నంగా వృద్ధునిచేయి ముద్దాడిందా ముద్దియ చిరుగడ్డాం.

"అబ్బ! యీపాటిమాటకే—పిల్చేవు తాతా! నీకు తెలీదు—సాయంకాలం నేనేం చేస్తానో అదే యిప్పుడుకూడ చేస్తున్నాను."

"అవును తల్లీ, పొరపడ్డాను. మరీ నువ్వు సాయంకాలం చేయవలసిన దిప్పుడు చేస్తున్నావు కదా—సాయింకాలం ఏంచేస్తావు?" వణుకుతూన్న చేయి బాలిక చిరుగడ్డంమీద వాలింది. నవ్వుతున్నాది బోసినోరు. "అమ్మదొంగా! మరచిపోయా ననుకున్నావా? మరి సాయింకాలంరోజూ నువ్వు కథలు చెప్తా ననలేదు. అప్పుడు మరాడుకోను. కథ వింటాను......యిప్పుడు మరివిడిచీ సాయింకాలం కావస్తోంది. మరొ క్కాట ఆడుకొని పారిపోస్తా. నే వచ్చేసరికి నువ్వు సిద్ధంగా బొబ్బతాగి అదేదో నిన్న సంగోరుకథ చెప్పూపోయి వాల్చేవే కాళ్లూ

చేతులూ కడుక్కొని—అది వార్చుకొని కూర్చొ వస్తాను. చక్కని పెద్దకథ చెబుదువుగాని—చెబితే తాతా! అల్లరిపెట్టకుండా నువ్వెంత బువ్వెడితే అంతే తింటాను. మారడగను. ఏం?......ఒక్క ఆట ఆడుకొని వస్తాను.” తాత నోరు సవరించుకొనేలోపుగా మాల్యం పారిపోయింది. తాత పిల్చేడు “మాల్యం! మాల్యం!” అని. అసలక్కడుంటేనా పలకడానికి.

౨

పరిశ్రమచేసి తిండికోసం పరుగెట్టిన పక్షికులం, పాటుపడ్డ కర్షకులతోపాటు నిక్షేపంలా యిలుసేరుకుంటున్నాయి. పగటిదేవుఁడు పశ్చిమపల్లకీ నెక్కగానే నిశాపతి నిర్భయంగా పగటిదేవుని రాజ్యాన్ని మగటిమగచాట్లుపాలయేలాగా వరించుకున్నాడు. దడిసిందేమో నిశకి మాల్యం తాతను చేరింది కౌగలించుకుంది. “అబ్బ! నొక్కేశావమ్మా! ఆటలయాయి?”

“చీకటి పడిపోతూంటే అవకేం చేస్తాయి. నీవన్నీ అయాయి? కథ మొదలెట్టు.”

“చిన్నారి! మరచిపోలేదమ్మా?—నిన్న సావిత్రి కథ చెప్పేను జ్ఞాపకం ఉందా?—”

“ఉన్నాది. గాని నువ్వు చెప్పమంటే. ఊ!.... నే చెప్పను. మరోకథ చెప్పు—మెల్లగా నేదో కాలక్షేపం—చేసి కథ యెగేదామని—నీ ఊహ—నాకు తెలీదనుకున్నావా? చెప్పు. చెప్పకపోతే నేను లావుగా అన్నం పెట్టమని యేడుస్తాను.”

“అయ్యో! వెర్రితల్లీ!—లావుగావుంటే నీకు పెట్టక తినేవాడినా—నేను—లేకేకదా యిన్ని అగచాట్లు—”

“మరీ మనకీ బువ్వలేకపోతే యీ సిల్కు రవిక లెక్కడివి దొంగా—అన్నీ అబద్ధాలే—”

“అయ్యో! నా తల్లీ—అబద్ధాలుగావమ్మా—యీ రవికలు—నా భాగ్యరాసివి,— నా సౌందర్యశశివి,—పోయింది—నా భాగ్యరాసి నసించిపోయింది—నా సౌందర్యశశి అస్తమించి పోయింది...” అప్రయత్నంగా ముసలాడి లొట్టకన్నులు నీళ్లు చిమ్మేయి.

“తాతా! ఏం! యేడుస్తున్నాం?—భాగ్యరాసెవరు? చెప్పు....తాత!!—పోనీ—చెప్పవుకాదూ—పోనీ పోనీ—”

“వద్దుతల్లీ! అంతా రేపకు—భరింపలేను రేపకు” అని వణకుతూన్న చేతితో కడుపు పట్టుకు, కుమిలిపోతున్నాడు—అతి కష్టంమీద ఆపుకున్నాడు—పిల్ల బెంగపెట్టుకుంటుందని......మాల్యం—పట్టుపట్టింది...ముసలాడికి చెప్పక తప్పిందికాదు—రవిక కథ—గుండె పాషాణం చేసుకున్నాడు. నోరు సవరించుకున్నాడు.. వ్యథ కారిపోతున్న పెదవులు మెల్లగా నాలుకతో తడిచేసుకొంటూ మధ్య మధ్య యెగిరే మాల్యం ముంగురులు సవరిస్తూ రవిక కథ యిలా చెప్పేడు.

“మీ అమ్మమ్మ నాకో ఆశాజ్యోతినిచ్చి శోషించిన నా అంధకార జీవితమంతా నీద మంది...అదే నీ తల్లి-నాలుగు రాళ్లార్జించుకొంటూ మీ అమ్మమ్మని మరచి మీ అమ్మను పెంచుకున్నా...తల్లీ!...మీ తల్లినిబోలిన సుందరీ విశాల ప్రపంచంలో మరుండబోదమ్మా!...”

“తాతా! నా కమ్ముందా?!...అమ్మ దొంగ తాతా...యిన్నాళ్లు చెప్పకుండా—చూపెట్టకుండా—మా అమ్మను దాచేసేవా?....నీపని చెప్తానుండు.”

‘లేదుతల్లీ నీవంత నోచుకోలేదు. నేను నిన్ను నీ తల్లి చేతులమీద నుండగా చూచేపాటి అదృష్టము చేసుకోలేదు....అమ్మా మీ తండ్రి...ఒక బారిష్టరు.’

“ఏంటి తాతా—మానాన్నే!”

‘కాని అతడు యిప్పుడు మనలను మరచిపోయేడు.’

"ఏమన్నాం—బాగుంది—నిన్ను మరుస్తే మరచేడేమో నన్నుకూడా నా—? బాగుంది—ఇందాక నేను అమ్మ చేతులో ఉండడానికి నోచుకోలేదన్నాం, యిప్పుడిలా అంటున్నా. చెప్పు... చెప్తా" గబగబా పరికిణి కబ్బా సర్దుకొంది.

'ఆహా! వెర్రితల్లి—అమ్మ-ఎక్కడైనా ఉంటే-మీనాన్న నిన్ను మరుస్తాడా-వాడితలా ?నౌఖరులా కాచుకోడు నిన్ను—నీతల్లి—నన్నో—అనాథునిగా చేసి నిన్ను దిక్కుమాలిన పక్షిని చేసి-వెళ్లిపోయింది-"

"మళ్లీ వస్తుందా ?"

"మళ్లీవస్తే—మనబ్రతుకిలా ఉండదమే-నీతండ్రి నీతల్లిని—నానా అగచాట్లు పాలు చేసి—లండనులో చదివిన మూన్నాళ్ల ముచ్చటికి ఓ ముండతోగూడా దిగబడి—యిప్పుడు పూర్తిగా మనలను మరచేడు. ఆ ముండతో వచ్చి నీతల్లిని నీతండ్రి పెట్టిన బాధలు చెప్ప తరంకాదు—"

"మా అమ్మనే—.! ఎందుకూ—తాతా"

"అయ్యో వెర్రితల్లి—బాగులేదని-నాజూకు తెలీదని—దొరసానిలా ఉండదని—కాల్చుకు తినేవాడు. దానిబాధ చల్లారింది. మన్నో దిక్కుమాలినవార్ని చేసి పోయింది—" ఏడుస్తున్నాడు తాత.

"పోనీ! తాతా—ఏడువకు నువ్వుకూడా లేకపోతే నేనే నక్కలపాలో అయ్యుందునుకదా—"

"అంతపని కానీలేదు. లేదూ—భగవంతుడు? అమ్మపోయాక నిన్ను నాదగ్గరకుదిగపెట్టేడు నీతండ్రి. వట్టి నిర్దయుడు—అప్పుడు నీతల్లిని నీ కేమే నా యిమ్మని నే కాళ్లా వేళ్లా పడ్డాను. అప్పుడు ముఖం విసిరేసుకొని యీ రవికేవుందని నా మొఖాన్న పారేశాడు.

అదే—రవిక లేకపోతే మనకెక్కడిది తల్లీ—'అని రవికచూచు కేడుస్తున్నాడు ముసలివాడు. ఎప్పుడూ యెంతకీ యేడువని మాల్యంకూడా యేడ్చింది తాత కాళ్లమీదపడి......తల్లి-మీద-ప్రేమ-కాదూ.

---


## జ్వరం వ్యాపారుల వ్యవహారాన్నే చెడుస్తుంది

బాంద్రానుండి మిస్టర్ ఎ. వి. రావు అనే వ్యాపారి ఇలావ్రాస్తున్నారు: "కంట్రాక్టు తీసుకోడానికిక మూడు వారాలేవుంది. అపుడు జ్వరం ప్రారంభించింది. క్రమంగా నిమ్మళించినా వ్యాపారంలో దిగడానికి నాకు భయంవేసింది. తిండి దిగదు; డోకులు; బరువు తగ్గిపోయింది. అపుడు డాక్టరు హార్లిక్సు సిఫార్సుచేశాడు. కలిగిన మార్పుమాత్రం అద్భుతం. నాకు తిరిగి బలంవచ్చింది. జ్వరంచేత కలిగిన బలహీనత మాయమైంది. గడువు ముగించడానికి రెండు దినాలు ముందుగానే కంట్రాక్టు తీసుకున్నాను. నా వ్యాపారం నాకు దక్కింది; హార్లిక్సుకు కృతజ్ఞుణ్ణి."

మిస్టర్ ఎం. వి. రావు, బాంద్రా.

నేడే హార్లిక్సు కొనండి—అంతటా దొరుకుతుంది.